# బూమరాంగ్



విచిత్ర మహా సామ్రాజ్యంలో సినిమా రంగం చాలా అభివృద్ధి చెందింది.

'చిత్ర కులాలంకార', 'చిత్ర సామ్రాట్' బిరుదులు పొందిన ఆ ఇద్దరు తెలుగు చిత్రరంగాన్ని చెరిగిపారేస్తున్న మహానటులు. వీరిద్దరూ చిత్ర ప్రపంచాన్ని మకుటం లేని మహారాజులుగా ఏలుతున్నారు.

తెరమీద అయితే వారు మూర్తీభవించిన త్యాగమూర్తులు. మంచికి మారుపేర్లు, సద్గుణాల రాసులు... వగైరా వగైరా. నిజ జీవితంలో ముష్టివాడికి సాటి ముష్టివాడు

శత్రువైనట్లు- ఇద్దరూ ఒకే రంగంలో ఉండడంతో ప్రొఫెషనల్ జెలసీతో కొట్టుమిట్టాడుతుండేవారు. ఇద్దరికీ ఒకరిపైన ఇంకొకరికి పరమ అసూయ. మనసులోంచి ఉబుకుతున్న అసూయను చిరునవ్వు ద్వారాలు దాటి బయటకు రానిచ్చేవారు కాదు.

మహానటులిద్దరికీ ఊరూరా కుక్క గొడుగుల్లాగా కావలసిన అభిమాన సంఘాలు ఉన్నాయి. 'చిత్ర కులాలంకార' చిత్రం విడుదల అయితే 'చిత్ర సామ్రాట్' గారి అభిమానులు ఆ థియేటర్లలో నానా అల్లరీ, హంగామా చేసేవారు. రాత్రిపూట ఎవరూ చూడకుండా ఆ సినిమా పోస్టర్ల మీద ముఖ్యంగా పోస్టర్‌లోని ఆయన ముఖంమీద పేడ ముద్దలు కొట్టించేవారు. 'చిత్ర సామ్రాట్' గారి చిత్రాలు విడుదలైనప్పుడు కూడా 'చిత్ర కులాలంకార' గారి అభిమానులూ ఇలాగే చేసేవారు. ఈ ఇద్దరి అభిమానుల ఆదరణ మూలంగా పేడకి మంచి గిరాకీ ఏర్పడి అదొక లాభసాటి వ్యాపారం అయ్యింది. చివరకు పేడ కూడా 'బ్లాక్'లోకి వెళ్లసాగింది.

ఈ ఇద్దరు మహా నటులకీ పరస్పరం ఎంతటి అసూయాద్వేషాలున్నా- సభలలో, సమావేశాలలో, నలుగురి ముందూ సినిమాలో చూపించేటంత ప్రేమాభిమానాలను- అన్నదమ్ముల అనుబంధం, ప్రాణ మిత్రులు తరహాలో ఒలకబోసుకొనేవారు. ఒకరిని గురించి ఇంకొకరు ఇంద్రుడనీ, చంద్రుడనీ పొగుడుకుంటూ మాట్లాడుతుంటే తేనెపట్టు మీద రాయి వేస్తే తేనె కారినట్టు వారి ప్రేమ కారుతూ ఉండేది. నలుగురూ చూస్తుండగా గాఢాలింగనం చేసుకుని, ముద్దులెట్టుకున్నంత పనిచేసేవారు. (నలుగురిలో కాకుంటే ఆ కౌగిలి పరస్పరం ధృతరాష్ట్ర కౌగిలే అయ్యేది.)

అయితే... పత్రికల వాళ్ళు మాత్రం- 'ఇదంతా వట్టి బూటకమనీ, కల్తీ లేని నటన' అనీ గిట్టని రాతలు రాయసాగారు. ఈ ప్రచారాన్ని ఏదో విధంగా ఆపించాలన్న కోరిక ఇద్దరికీ బలంగా ఉంది. ఒకసారి అనుకోకుండా అటువంటి అవకాశం వచ్చింది.

ఆ ఊరిలో కొత్తగా ఒక సాంస్కృతిక సంస్థను 'చిత్ర కులాలంకార' స్థాపించదలిచాడు.

దాని ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా 'చిత్ర సామ్రాట్'ని పిలిచాడు. అందుకు ఆయనా ఒప్పుకున్నాడు. అయితే... ఇదే అవకాశంలో 'చిత్ర సామ్రాట్'ని అవమానించదలిచాడు 'చిత్ర కులాలంకార.'

ప్లాన్ ప్రకారం- 'చిత్ర కులాలంకార' కారు ముందు వెళ్తూంటే వెనకాల 'చిత్ర సామ్రాట్' కారు వస్తూంటుంది. వెనక కారులోంచి ఆయన దిగగానే 'చిత్ర కులాలంకార' అభిమానులు ఆయన మీద పేడ జల్లుతారు. వెంటనే ఆయన అడ్డుపడి తన అభిమానులని కేకలు వేసి స్వయంగా 'చిత్ర సామ్రాట్' మీద పడ్డ పేడను తుడుస్తాడు.

అనుకున్నట్లుగానే కార్లు రెండూ సభాస్థలికి బయలుదేరాయి.

అయితే... దారిలో ట్రాఫిక్ జాం ఏర్పడడంతో- దానిని క్లియర్ చేయడంలో 'చిత్ర సామ్రాట్' కారు ముందుకెళ్లింది.

సభా ప్రాంగణం దగ్గర రెండు కార్లూ ఆగాయి.

కిరాయి అభిమానులు రెండో కార్లోంచి దిగే మనిషి మీదనే పేడ కొట్టాలన్న విషయాన్ని గుర్తుంచుకొన్నారు కాని.., ఎవరు దిగుతోందీ గమనించలేదు. 'చిత్ర కులాలంకార' కారునుంచి దిగగానే ఆయన అభిమానులు ఆ దిగింది 'చిత్ర సామ్రాట్' అనుకొని ధనాధనా ఆయన మీద పేడ ముద్దల్ని విసిరారు.

ఆ దృశ్యాన్ని చూసిన ప్రేక్షక సమూహం పట్టరాని సంతోషంతో చప్పట్లు చరిచింది.

*- జాగృతి... ప్రత్యేక సంచిక '88*

బూమరాంగ్ : ఆస్ట్రేలియాలోని ఆదిమజాతులవారు ఆకాశంలో ఎగిరే పక్షుల్ని వేటాడేందుకు ఉపయోగించే ఆయుధం పేరే బూమరాంగ్. దీనిలోని విశేషమేంటంటే... దీన్ని దేనిమీదకు ప్రయోగిస్తారో ఆ లక్ష్యానికి తగిలిన తర్వాత తిరిగి ఈ ఆయుధం దానంతట అదే ప్రయోగించిన వ్యక్తి దగ్గరకు చేరుకుంటుంది.



## లెఫ్ట్ రైట్

మేజర్ ఆనంద్‌కి రాజకీయాలంటే బొత్తిగా ఇష్టం లేదు.

ఒకసారి ఆయన ఒక విందులో కొందరు సివిల్ స్నేహితులతో పాల్గొనడం జరిగింది. భోజన సమయంలో చర్చ రాజకీయాల వైపు మళ్లింది.

ఒకరు- "మేజర్ సాబ్.. మీరు లెఫ్టిస్టా- రైటిస్టా?" అని అడిగారు.

వెంటనే మేజర్ తడుముకోకుండా- "నేను లెఫ్ట్-రైటిస్ట్‌ను!" అన్నాడు తన యూనిఫాం వంక చూసుకుంటూ.